క్లుప్తంగా

అనారోగ్యంతో కో–ఆప్షన్ సభ్యుడు మృతి


ఇషాక్ (ఫైల్)

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఇషాక్ (52) బళ్లారి ఆస్పత్రిలో సోమవారం మృతి చెందారు. విషయం తెలియగానే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి ఫోన్‌చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ ఎం.పవిత్ర, జెడ్పీటీసీ హసీనాబాను, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి సంతాపం తెలిపారు.

నేటి నుంచి 'పంట రుణాలు'

కూడేరు: స్థానిక స్టేట్ బ్యాంక్‌లో మంగళవారం నుంచి రైతులకు కొత్తగా క్రాప్‌లోన్లు ఇవ్వనున్నట్లు మేనేజర్ నాగరాజు సోమవారం తెలిపారు. బ్యాంక్‌లో క్రాప్‌లోన్ పొందేందుకు జామీన్‌దారు, నోడ్యూస్ సర్టిఫికెట్ అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో భూ వివరాలకు సంబంధించి కంప్యూటర్ అడంగల్, 1బి, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్, పాస్ ఫోటో ఉంటే చాలన్నారు. లోన్ కావాల్సిన రైతులు బ్యాంక్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

బ్రహ్మసముద్రం: పర్యవరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీశాఖ అధికారులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చెత్త నుండ సంపద తయారీ కేంద్రం ఆవరణలో అటవీశాఖ వారి ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాల్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకిషన్ , ఎంపీడీఓ వెంకటనాయుడు, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, అటవీశాఖ అధికారులు షానావాజ్, సుబ్రహణ్యం తదితరులు పాల్గొన్నారు.

దళిత సమస్యలపై నిరహార దీక్ష

శెట్టూరు: దళితుల సమస్యలపై ఎమ్మార్పీఎస్ నాయకులు ఒక రోజు నిరహార దీక్షను చేపట్టారు. బ్రహ్మయ్య మాదిగ కమిటీ మండల అధ్యక్షుడు తిప్పేస్వామి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కోకన్వనర్ గురుమూర్తి తదితరులు హాజరయ్యారు. ఏబీసీడీ వర్గీకరణ చట్టసభల్లో ప్రవేశ పెట్టాలని, మండలంలోని అన్ని గ్రామాలలో దళితులకు శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని, ఐదు మండలాల్లో అంబేడ్కర్ భవనాలు నిర్మించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పురోగతి సాధించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, మహేష్, బొమ్మలింగ, నాగభూషణం, బొమ్మలింగ, బాబు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు ప్రారంభం


వేసవి ఉచిత బడులను ప్రారంభిస్తున్న దృశ్యం

కుందుర్పి: స్థానిక ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం విలువల బడి వేసవి శిబిరాలను ఆ సంస్థ నిర్వాహకుడు ఎస్‌కే లెనిన్ బాబు ప్రజా ప్రతినిధులతో కలసి 16 గ్రామాల్లో ప్రారంభించారు. ప్రతి శిబిరానికీ ఒక ప్రైవేటు అధ్యాపకుడిని నియమించి పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టారు.కార్యక్రమంలో సర్పంచ్ మారుతేశ్వరి, ఎంపీటీసీ గంగమ్మ, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, పీసీ కమిటీ చైర్మన్ ఎలక్ట్రికల్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలి


మాట్లాడుతున్న పట్టా ఖాజాపీరా

వజ్రకరూరు: విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని విశ్రాంత ఎంపీహెచ్ఈఓ పట్ట ఖాజాపీరా సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మునెమ్మ అధ్యక్షతన ఎనిమిదో రోజు సమ్మర్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులో పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, క్యారమ్స్, చెస్, క్రికెట్ తదితర ఆటలు ఆడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


కంబదూరు: సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్


రాయదుర్గం: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కంబదూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మండలంలోని దేవేంద్రపురం, కొత్తమిద్దెల గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో చేకూరిన సంక్షేమ లబ్ధిని అంకెల సహా ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కర చర్యలు చేపట్టారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాలు కావాలంటే కులమాతలు, పార్టీలను చూసేవారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదన్నారు. అర్హత ఉంటే కులమతాలు, పార్టీలు ఏవీ చూడకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించి సీఎంను చేసుకుందామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్, వైస్ ఎంపీపీలు బీమేష్, తిమ్మారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, బాపూజీ, కళ్యాణదుర్గం సచివాలయ కన్వీనర్ బొట్టవానిపల్లి అంజి, నాయకులు వడ్డే గోవిందప్ప, లోకనాథ్‌రెడ్డి, కిష్టప్ప, కాశీరెడ్డి, జయరామప్పనాయక్, మూర్తినాయక్, నరేంద్ర, నాగభూషణ, కుళ్లాయిరెడ్డి, ఐపార్సుపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచిచేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి

డి హీరేహాళ్(రాయదుర్గం): మంచి చేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తిచేశారు. సోమవారం డి హీరేహాళ్ మండలంలోని చెర్లోపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. టీడీపీ నాయకులు చేప్పే కల్లిబొల్లి మాటలు నమ్మి మోసపోలేమని, జగన్ వెంటే తామంతా నడుస్తామంటూ ప్రజలు భరోసా కల్పించారు. అనంతరం విప్ విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో ఇంటికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ లబ్ధి చేకూర్చారన్నారు. ఈ నాలుగేళ్ల జగన్ పాలనలో ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను గుర్తుచేసేందుకే గడప గడపకూ వచ్చామని విప్ వివరించారు. దేశరాజకీయాల్లోనే ఎక్కడా లేని విధంగా ఒక్క ఏపీలో మాత్రమే అధికారంలో ఉండే పార్టీ ఇలా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. సీఎంగా జగన్ ఉంటేనే అమ్మఒడి, ఆసరా, చేయూత, వైఎస్సార్ పెన్షన్, సున్నా వడ్డీ, రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందుతాయనే విషయం తెలుసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు నీరు–చెట్టు ద్వారా వంకలన్నీ కొల్లగొట్టి రూ. కోట్లు దోపిడీ చేశారని, అలాంటి ద్రోహుల మాటలు నమ్మి ఏ ఒక్కరు మోసపోవొద్దని విప్ హితవు పలికారు. 2024 తర్వాత టీడీపీ కనుమరుగైపోక తప్పదన్నారు. కాళ్లకు చెప్పులు కూడా గతిలేని కొందరు టీడీపీ నాయకులు నేడు కార్లలో తిరిగే స్థితికి ఎలా ఎదిగారో అర్థం చేసుకోవాలన్నారు. చంద్రబాబు అపద్దపు హామీలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పమేశ్వర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచులు మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, హనుమంతరెడ్డి, బసవరాజు, నాగరాజు, ఎంపీటీసీ లు కల్యం సురేష్, గోవిందు, నాయకులు తొండె వెంకటేశులు, జయరామిరెడ్డి, రవి, తిమ్మనగౌడ, చంద్ర, గన్నిగౌడ, నరసింహులు, నాగయ్య, ఖాసీంపీర తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కంబదూరు: మండలంలోని నూతిమడుగు, తిప్పేపల్లి గ్రామాల్లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు తిప్పేపల్లి, సాయంత్రం 4 గంటలకు నూతిమడుగు గ్రామాల్లో జరిగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం 'స్పందన'లో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనుమతి లేకుండా నడుపుతున్న నారాయణ, చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు అడ్మిషన్లు చేయకూడదని చెప్పినా నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారన్నారు. లక్షలాది రూపాయలు ఫీజులు వసూళ్లు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. రెండు విద్యా సంస్థల్లో 9,10 తరగతులకు అనుమతులు లేకపోయినా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఎంఈఓకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు నవీన్, పట్టణ నాయకులు సందీప్, హర్ష, పునీత్, బాలాజీ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

140 మంది పిల్లలకు ఉచిత ఖత్నా


ఖత్నా చేయించుకున్న పిల్లలకు సరుకులకిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయదురంటౌన్: రాయదుర్గం అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 140 మంది పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచిత ఖత్నా(సున్తి) కార్యక్రమంన్ని నిర్వహించారు. పట్టణంలోని బళ్లారి రోడ్డు నందు జామియా అన్వారుల్ ఉలుమ్ మదరసాలో సోమవారం ఖత్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం 11 రకాల నిత్యవసర సరుకుల కిట్లను ఖత్నా చేయించుకున్న పిల్లలకు అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ మాట్లాడుతూ ఖత్నా కార్యక్రమం విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, కమిటీ ఉపాధ్యక్షుడు బాషా, కార్యదర్శి మొహ్మద్ షఫీ, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు డ్రైవర్ బాష, ఖాసీం, ఉమ్రలీ, రజాక్, షేక్ జాకీర్, షాకిర్, పట్టణంలోని ముతవల్లీలు, కౌన్సిలర్ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లను బలోపేతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ తేజశ్విని

వజ్రకరూరు: ప్రాథమిక వ్యవసాయసహకార పరపతి సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేయాలని జిల్లా ప్యాక్ డెవపల్‌మెంట్ మేనేజర్ తేజశ్విని సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఏడీసీసీ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్ పి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన పీఏసీఎస్ డెవలప్‌మెంట్ వర్క్ షాప్ ఆన్ పీఏసీఎస్ అన్యూవల్ బిజినెస్ ప్లాన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పీఏసీఎస్‌ల ద్వారా రుణాల మంజూరుతో పాటు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా బిజినెస్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సంఘాల ద్వారా ఫర్టిలైజర్స్, బంగారు రుణాలు, పప్పుశనగ విత్తనాల కొనుగోలు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, పాల సేకరణ, సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేసి సంఘాల ఆదాయం పెరిగేలా కృషి చేయాలన్నారు. వాటిని ఏర్పాటు చేయడానికి ఏడీసీసీ బ్యాం కు 4 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేస్తామన్నారు కార్యక్రమంలో నోడల్ అధికారి రాధిక, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, డైరెక్టర్లు రాచన్నగౌడ్, బల రాముడు, వజ్రకరూరు, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, కణేకల్లు మండలాల చె ందిన సీఈఓలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల నేరవేరిన వేళ

- 67 మంది మైలారంపల్లి ముంపు బాధితులకు ఇంటి పట్టాలు
- ప్రభుత్వ పనితీరుపై గ్రామస్తుల హర్షం


మైలారంపల్లి వాసులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ(ఫైల్)

ఉరవకొండ: పెన్నహోబిలం బ్యాలెన్స్ రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో గ్రామం మొత్తం ముంపునకు గురవుతూ ప్రజలు ఇళ్లు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకునే దుస్థితి. ఇది ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీలోని మైలారం పల్లి గ్రామ ప్రజల అవస్థ. గత 30 ఏళ్లుగా ఆ గ్రామ ప్రజలు ముంపు బారిన పడి అవస్థలు పడుతున్నా.. ఎమ్మెల్యే కేశవ్‌కు ప్రజల ఇబ్బందులు పట్టలేదు. మైలారంపల్లిలో 200 ఇళ్లు ఉన్నాయి. గ్రామానికి సమీపంలోనే పీఏబీఆర్ డ్యాం ఉండటంతో గ్రామం నిత్యం ముంపునకు గురవుతోంది. డ్యాం బ్యాక్ వాటర్ వల్ల పెద్ద ఎత్తున ఇళ్లల్లోకి చేరి నిత్యవసర వస్తువులు మొత్తం నీటి పాలై..ఇంటిల్లిపాదీ బయటకు వచ్చి మరో చోట తలదాచుకోవాల్సిన దుస్థితి.

ఫలించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ కృషి

మైలారం పల్లి గ్రామ ప్రజలకు న్యాయం చేయడానికి ఎన్నో ఏళ్లుగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే కేశవ్ టీడీపీ ప్రభుత్వ హయంలో కనీసం మైలారంపల్లి ముంపు దుస్థితి గురించి ఏమాత్రం పట్టించుకోకవడంతో ప్రజలు బ్యాక్ వాటర్‌తో ఇబ్బందులు పడుతునే ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మైలారంపల్లి ముంపు బాధితులకు న్యాయం చేసి మరో చోట పట్టాలు మంజూరు చేయిస్తామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గ్రామస్తులకు హామీ కూడా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలోని 67 మందికి ఇంటి పట్టాలను మంజూరు చేయించారు. గ్రామస్తులు ఎక్కడైతో కోరుకున్నారో అక్కడే పట్టాలు ఇప్పించి.. వారి కలను మాజీ ఎమ్మెల్యే విశ్వ నెరవేర్చడం పట్ల మైలారంపల్లి గ్రామంలోనే కాదు కొౌకుంట్ల పంచాయతీ ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఇంటి నిర్మాణాలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే విశ్వ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ముంపు నీటితో అవస్థలు పడ్డాం



డ్యాంకు వచ్చే నీటితో మా గ్రామం మొత్తం నీటిలో మునిగేది. ఇంట్లో నీరు వస్తే నెలల తరబడి అలాగే ఉండేది. కనీసం పిల్లలకు భోజనం వండి పెట్టే పరిస్థితి. మాజీ ఎమ్మెల్యే విశ్వన్న మాకు పట్టాలు ఇచ్చి ఎంతో సాయం చేశారు.

– మస్తాన్‌బీ, మైలారంపల్లి

విశ్వకు రుణపడి ఉంటాం



20 ఏళ్లుగా ముంపు నీటితో బాధ పడుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మా గ్రామానికి వచ్చి మా దుస్థితి గమనించి వెంటనే అధికారులతో మాట్లాడి ఇంటి పట్టాలు ఇప్పించి మాకు న్యాయం చేశారు.

– అల్లాబక్ష్, మైలారంపల్లి

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ రూరల్: మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. అనిల్‌కుమార్ 10వ తరగతి పరీక్షలో ఫెయిల్ అయ్యాడని స్నేహితులు అవహేళన చేయడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైతులకు పరిహారం అందించండి

కళ్యాణదుర్గం: జిల్లావ్యాప్తంగా వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఎం నాయకులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్, రంగనాథ్, నాగరాజు, అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీలు డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రబీలో అకాల వర్షాలు, గాలులతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందించాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మిస్తాం


తాళ్లకెర గ్రామంలో పర్యటించిన కాపు ప్రవీణ్‌రెడ్డి

గుమ్మఘట్ట: ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డును నిర్మిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకుడు కాపు ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లకెర గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన పర్యటించారు. వర్షం వస్తే రోడ్డుపై సంచరించేందుకు ఇబ్బందిగా ఉందని, సీసీ రోడ్డును నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని కాలనీవాసులు ఆయన విజ్ఞప్తి చేశారు. స్పందించిన ప్రవీణ్ రెడ్డి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డును నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డికి సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలోనే సీసీ రోడ్డును నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కోనాపురం నాగిరెడ్డి, నాయకులు పల్లక్కిరెడ్డి, మురళి, తిప్పేస్వామి, నారాయణరెడ్డి, నాగరాజు, ఈరన్న, షేక్షావలి, మాంతేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

పెద్దవడుగూరు: మండలంలోని ఆవులాంపల్లి గ్రామంలో సోమవారం రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆరుపళ్ల విభాగంలో పోటీలు నిర్వహించగా, 18 జతల వృషభాలు పాల్గొన్నాయి. 9 జతలకు బహుమతులను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అన్నసత్ర భవనం ప్రారంభం


అన్నసత్ర భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి, పండరీపురం పీఠాధిపతి గోపాల్ మహారాజ్

బొమ్మనహాళ్: ఉంతకల్లులో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ వద్ద నూతనంగా నిర్మించిన రుక్మిణీ పాండురంగస్వామి అన్నసత్ర భవనాన్ని సోమవారం ఉదయం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి, పండరీపురం పీఠాధిపతి గోపాల్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. వారు మాట్లాడుతూ ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యం కోసం అన్నసత్ర భవనాన్ని నిర్మించారన్నారు. అన్నసత్ర భవనంలో కల్యాణ మండపం, భోజనం హాల్, 30 పైగా రూమ్‌లు, అలాగే బాత్‌రూమ్‌లను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఏకాదశి రోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మెట్టు హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, నాయకులు లోకేష్, రామాంజనేయరెడ్డి, ముల్లంగి నారాయణస్వామి, ప్రతాప్‌రెడ్డి, పెద్దిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, వీర్నన‌గౌడ్, బసవరాజు, వన్నూరుస్వామి, ముక్కన్న, ఆంజినేయులు, తిప్పేస్వామి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

బ్రహ్మసముద్రం: సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌కు సంబంధించి మండలవ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్నట్లు ఏఓ సరిత తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో రీ సర్వేను చేపట్టి రైతుల సమస్యలకు పరిష్కారం చూపామని తహసీల్దార్ బాలకిషన్ అన్నారు. హౌసింగ్ సంబంధించి మండలంలో 341 ఇళ్లు మంజూరు అయ్యాయని, 247 మంది లబ్ధిదారులు నిర్మాణం చేపడుతున్నారన్నారు. సీడీపీఓ వనజ అక్కమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటనాయుడు, ఏఓ నందకిశోర్, ఎంఈఓ ఓబుళపతి, వైస్ ఎంపీపీ వెంకటేష్‌నాయక్, ఎంపీటీసీలు నాగలక్ష్మి, వరలక్ష్మి , నగేష్ , సర్పంచ్‌లు పూజ, శెట్టిగారి మంజునాథ, ఆదినారాయణ రెడ్డి, గోవిందప్ప, ఏఈ బాలచంద్ర, వైద్యాధికారి రాజేష్, సూపర్‌వైజర్ పద్మ, ఏపీఎం లీలామణి, పీఆర్ జేఈ విజయ్‌కుమార్, ఆర్ డబ్ల్యూఎస్ సుబ్బరాయుడు, పశు వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల పోటాపోటీ బల ప్రదర్శనలు


పోలీసులతో వాగ్వాదానికి దిగిన తెలుగు తమ్ముళ్లు

కళ్యాణదుర్గం: నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం టీడీపీ నాయకులు కళ్యాణదుర్గంలో బలప్రదర్శనకు దిగారు. టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడు తన వర్గం కార్యకర్తలు, అనుచరులతో శెట్టూరు మండలం యాటకల్లు నుంచి కళ్యాణదుర్గంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకూ పాదయాత్ర చేశారు. తామేమీ తక్కువ కాదన్నట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, తనయుడు మారుతీ చౌదరి కుటుంబ సభ్యులు తమ అనుచరులతో కలిసి కళ్యాణదుర్గం మండలం పాపంపల్లి వద్ద నుంచి కళ్యాణదుర్గం పార్టీ కార్యాలయం వరకూ పాదయాత్ర చేశారు. ఒకే పార్టీలో ఇరువురూ ఒకేసారి సంఘీభావ పాదయాత్ర చేయడంతో ఎటు వెళ్లాలో అర్థం కాక టీడీపీ కార్యకర్తలు తలలు పట్టుకున్నారు. ఎటూ పోక ఇంటికే పరిమితమయ్యారు. దీంతో ఎలాగైనా జనం కనిపించేందుకు వెంట వచ్చిన వారికి మద్యంతో పాటు వాహన ఖర్చులు ఆయా వర్గాల నేతలే భరించారు. ఇక సంఘీభావ పాదయాత్రకు పోలీసులు వీరబ్రహ్మేంద్ర ఆలయం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన రహదారి గుండా అనుమతి ఇచ్చారు. అయితే తాము వాల్మీకి సర్కిల్ మీదుగా వెళ్తామంటూ ఇరువురు శ్రేణులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొందరైతే ఏకంగా వాటర్ ప్యాకెట్లతో పోలీసులపై నీళ్లు చల్లుతూ కవ్వింపు చర్యలకు దిగారు. మహిళా పోలీసులున్నారన్న కనీస ఇంకిత జ్ఞానం లేకుండా టీడీపీ శ్రేణులు నీళ్లు చల్లడంతో సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. ఇక పాదయాత్రలో ఆర్టీసీ బస్సులకు కూడా దారి ఇవ్వకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. టీడీపీ నేతలు ఇలా పోటాపోటీగా బలప్రదర్శనకు దిగడం కేవలం అసెంబ్లీ టికెట్ కోసమేనని పలువురు చర్చించుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల జోరు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో 6వ తరగతి ప్రవేశాల కోసం డిమాండ్ నెలకొంది. విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈనెల 25వ తేదీ వరకూ గడువు ఉంది. ఆంగ్ల మాధ్యమంలో కార్పొరేట్‌కు దీటుగా ఉన్నతమైన, నాణ్యమైన విద్య ఆదర్శ పాఠశాలల్లో అందిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాక విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటన్న విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు ఎంతో నమ్మకం చూపుతున్నారు. మరోవైపు ఈ ఏడాది పది, ఇంటర్ ఫలితాలు మెరుగ్గా వచ్చాయి. పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో వంద సీట్లకు గాను జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటి దాకా 92 మంది దరఖాస్తు చేసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ టి.వెంకటేశులు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో (జ్జి ఐటు://ౄ ఐఝుట.ౄ ఇజౌ౦.జీ ఃౖ) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు అనంతరం హార్డ్ కాపీని స్కూల్‌లో అందజేయాలన్నారు. పట్టణలోని మోడల్ స్కూల్‌లో జూన్11వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఓసీ, బీసీలకు 150 పరీక్ష ఫీజు ఉంటుందన్నారు. వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు.